క్లుప్తంగా

మార్గాని ఎస్టేట్‌లో నేడు సహస్ర కుంకుమార్చన


మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: భవానీ మాల ధారణలో ఉన్న మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్‌లో సహస్ర కుంకుమార్చన, పడిపూజ, భవాని భజన నిర్వహిస్తున్నారు. శ్రీదేవి నవరాత్రుల సందర్భంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో భవానీలు, భక్తులు పాల్గొనాలని భరత్‌రామ్ ఆదివారం ఆహ్వానించారు. కుంకుమార్చన, పడిపూజ వీక్షించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ నేడు ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

భారీ అన్న సమారాధన

కడియం: వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగర్‌లో వినాయక చవితి ఉత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గాల్లో భక్తుల ప్రాణాలు

ఒక అట్టముక్క ఓ కర్ర.. ఇదీ భక్తుల ప్రాణాల భద్రతకు అధికార యంత్రాంగం తీసుకున్న 'పటిష్ట' చర్యలు. నదిలోకి దిగొద్దంటూ పది రోజుల క్రితం అట్టపై రాసి.. రెండు వోట్ల కర్రకు కట్టి పెట్టారు. రెండు రోజుల్లోనే గాలివానకు అవి కాస్తా ఎగిరిపోయాయి.. నలుగురు భక్తుల ప్రాణాల్లాగే..

- పుష్కరఘాట్‌లో ప్రమాద ఘంటికలు
- ముందే హెచ్చరించిన 'సాక్షి'
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వరద ఉధృతంగా ఉండటంతో రెండు వారాల్లో నలుగురి గల్లంతు !
- తీరుబాటుగా పరిశీలించి.. హడావుడి చేసిన ఎమ్మెల్యే



'సాక్షి'లో ప్రచురితమైన కథనం


శుక్రవారం పుణ్య స్నానాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక తీరంలో భక్తుల ప్రాణాలకు విలువ లేకుండా పోయింది. పుణ్య స్నానాలకు వెళ్లే భక్తుల ప్రాణాలకు గోదావరి తీరాన భద్రత లేదన్న అపఖ్యాతిని అధికార యంత్రాంగం మూటగట్టుకుంటోంది. శరన్నవరాత్రులకు రాజమహేంద్రవరం ఎంతో ప్రసిద్ధి చెందింది. కోల్‌కతా తర్వాత రాజమహేంద్రవరంలో అంత గొప్పగా శరన్నవరాత్రులు జరుపుతారు. అంతేకాకుండా ఇక్కడ భక్తి భావం కూడా ఎక్కువే. ప్రతి ఏటా శరన్నవరాత్రులు మొదలుకొని.. కార్తిక మాసం వరకూ భవానీ, స్వామి మాలలు ధరించి భక్తిశ్రద్ధలతో దీక్షలు చేస్తారు. వారంతా పుష్కర ఘాట్‌లోని గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. ఎంతో భక్తితో మాలధారణ చేసిన భక్తులు, వారితో వచ్చిన బంధువుల ప్రాణాలకూ రక్షణ కొరవడింది. రెండు వారాల వ్యవధిలో ఇక్కడ ఇప్పటి వరకు నాలుగు నిండు ప్రాణాలు గల్లంతయ్యాయి.

రక్షణ చర్యలు లేక..

ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. దీంతో గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. మాలధారణ చేసిన భక్తులు నిత్యం తెల్లవారుజామున 4 గంటల నుంచి పుష్కరఘాట్‌లో స్నానాలు ఆచరిస్తారు. గోదావరి ఉధృతి అధికంగా ఉన్నా.. అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై 'సాక్షి'లో 'ఆధ్యాత్మిక తీరం.. అవస్థలమయం' శీర్షికన ఈ నెల 18న కథనం వెలువడింది. గోదావరి నీటిమట్టం 50 అడుగులు చేరినా.. అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఇద్దరు యువకులు ఒక్క రోజు వ్యవధిలో గల్లంతయ్యారు. అయినా నగరపాలక సంస్థ అధికారులు కానీ, నగర ప్రజాప్రతినిధులు కానీ స్పందించలేదు. నామమాత్రంగా గోదావరి గట్టున చిన్న అట్టముక్కపై నీటిలోకి దిగవద్దంటూ రాసి కర్రకి కట్టగా, అది గాలివానకి కొట్టుకుపోయింది.

అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

భక్తులకు రక్షణ కరవైందని విమర్శలు వెల్లువెత్తడంతో.. శనివారం గోదావరి నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో పుష్కరఘాట్ గేట్లను మూసివేశారు. అధికారుల నిర్లక్ష్యంతో సాయంత్రం మళ్లీ గేట్లను తెరిచారు. దీంతో భవానీ మాల ధరించడానికి వచ్చిన గుబ్బల బాపిరాజు, రాయుడు వీరబాబు స్నానమాచరించడానికి నీటిలోకి దిగి గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరిపై భక్తులు, వారి బంధువులు మండిపడుతున్నారు.


శనివారం ఉదయం పుష్కర ఘాట్‌లో మూసివేసిన గేట్


53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

తీరుబాటుగా వచ్చి..

భక్తుల ప్రాణాలు గాల్లోకి కలిశాక తీరుబాటుగా అధికారులతో కలిసి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదివారం వచ్చి హడావుడి చేసి వెళ్లారు. గోదావరి నీటి ప్రవాహం చాలా ఎక్కువగా ఉన్నందున పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రేవులోకి ఎవరినీ పంపవద్దని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇవే సూచనలు ఇది వరకే చేసి ఉంటే ప్రమాద ఘటనలు జరిగి ఉండేవి కావని భక్తులు చర్చించుకుంటున్నారు.

రక్షణ ఏదీ..?

శరన్నవరాత్రులలో రోజుకి సుమారు నాలుగు వేల మంది భవానీ, స్వామి భక్తులు స్నానమాచరించడానికి ఘాట్‌కు వస్తారు. వీరంతా త్వరగా స్నానమాచరించి, అమ్మవారికి పూజ చేసి, పనులకు వెళ్లే తొందరలో వారుంటారు. వరద ప్రవాహం మెట్ల పైకి వచ్చినప్పుడు కూడా ఒక్క అధికారి కానీ, సిబ్బంది కానీ కనీసం హెచ్చరించడం లేదు. వరద ఉధృతి ఎక్కువ ఉందని హెచ్చరిక బోర్డులూ పెట్టలేదు. ప్రాణాలు పోయాక తీరుబాటుగా వచ్చి, వెళుతున్నారు. ఇదేనా భక్తుల ప్రాణాలకు ఇచ్చే రక్షణ.

– టి.సీతారామమూర్తి, భక్తుడు

మృతదేహం లభ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో ఈ నెల 22వ తేదీన గల్లంతైన మండపేట మండలం తాపేశ్వరానికి చెందిన యలమంచిలి సురేంద్రకుమార్(22) మృతదేహం కపిలేశ్వరపురంలో లభ్యమైంది. శనివారం రాత్రి లభ్యమైన ఈ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సుభానీ అతని బంధువులకు అప్పగించారు. ఈ నెల 22న సురేంద్రకుమార్ పుష్కర్‌ఘాట్‌లో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే.

కానరాని ఆచూకీ

రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో స్నానానికి వెళ్లి ఊబిలో కూరుకుపోయి గల్లంతైన గోకవరం మండలం పెంటపల్లి గ్రామం, ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్న గుబ్బల బాపిరాజు(28), అతని బావ మరిది రాజానగరం శ్రీరామపురానికి చెందిన రాయుడు వీరబాబు(24) ఆదివారం రాత్రి 9 గంటల వరకు ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం బాపిరాజు, వీరబాబు పుష్కర్‌ఘాట్‌లో స్నానానికి వెళ్లి గల్లంతైనప్పటి నుంచి త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు మత్స్యకారులతో గాలిస్తున్నప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం భవానీల ఆచూకీ కోసం విస్తృతంగా గాలించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. గోదావరి ఉధృతి తీవ్రంగా ఉండడంతో భవానీలు ఎగువ ప్రాంతానికి కొట్టుకుపోయారా అని పోలీసులు భావిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు మాత్రం బాపిరాజు, వీరబాబు ఆచూకీ కోసం కన్నీటి పర్యంతమవుతున్నారు.

సినిమాలు



శ్యామల	:	కిష్కింధపురి
సూర్యమినీ	:	బ్యూటీ
సూర్యప్యాలెస్	:	ఓజీ
స్వామి	:	ఓజీ
అనుశ్రీ	:	ఓజీ
శివజ్యోతి	:	ఓజీ
రాజా	:	ఓజీ
ఊర్వశి	:	ఓజీ
మేనక	:	లిటిల్‌హార్ట్స్
రంభ	:	మిరాయ్
అప్సర	:	ఓజీ
అశోక నామవరం	:	కొత్త లోక
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	ఓజీ
మురళీకృష్ణ కడియం	:	ఓజీ
వెంకటసూర్య	:	ఓజీ

డాక్టర్ అంబేడ్కర్, కవి జాషువాకు నివాళులు

సీటీఆర్ఐ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజమండ్రి పర్యటించి 81 ఏళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని వేడుకలు జరపడం అభినందనీయమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. అలాగే ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం ఉదయం జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎంపీ భరత్ పాల్గొని, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి, గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ అంబేడ్కర్ బ్రిటిష్ వైస్రాయ్ కౌన్సిల్ మెంబర్ (కార్మిక శాఖ) హోదాలో 1944 సెప్టెంబర్ 28న ఇక్కడ పర్యటించడం రాజమహేంద్రవరానికే గర్వకారణమన్నారు. డాక్టర్ అంబేడ్కర్‌ను ఆనాటి మున్సిపల్ కౌన్సిల్ స్వాగతించి పౌర సన్మానం చేయడం, కాస్మోపాలిటన్ క్లబ్‌లో అప్పటి లాయర్లు సన్మానించడం చారిత్రక ఘట్టాలన్నారు. ప్రముఖ దళిత కవి గుర్రం జాషువా స్థానిక కోటిలింగాలపేటలో ఐదేళ్లు నివసించారని తెలిపారు. తెలుగు సాహిత్యానికి జాషువా ఎంతో కృషి చేశారని, ఆయన రచనలు సమాజానికి ఎనలేని మేలు చేశాయని కొనియాడారు.

విశ్వమానవ సమానత్వం జాషువా ధ్యేయం

తన కవిత్వాన్ని విశ్వ మానవ సమానత్వమే ధ్యేయంగా నడిపించారని కళా గౌతమి గౌరవాధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కళా గౌతమి తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నటరాజ నృత్య నికేతన్‌లో జరిగిన జాషువా జయంతి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, కుల వివక్ష లేని సమాజం కోసం జాషువా కవిత్వాన్ని పరుగు పెట్టించారన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ, కవితనే కత్తిగా వాడి కులమతాలపై పోరాడిన మహాకవి జాషువా అని కొనియాడారు. ప్రధాన వక్త, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సీహెచ్ కురుమయ్య మాట్లాడుతూ, ఆధునిక ప్రక్రియలన్నీ వదిలి, పద్య రూపాన్ని అస్త్రంగా చేసుకుని, అక్షరాలకు కొత్త శక్తినిచ్చిన కవి జాషువా అని నివాళులర్పించారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ భరత్ తదితరులు


జాషువా చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న విజయలక్ష్మి తదితరులు

వర్ధమాన కవులకు జాషువా స్ఫూర్తి

కడియం: ప్రముఖ కవి జాషువా సాహిత్యం వర్ధమాన కవులకు స్ఫూర్తిదాయకమని జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం రాష్ట్ర కో–కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. జాషువా జయంతిని స్థానిక గిరజాల కృష్ణప్రసాద్ కల్యాణ మండపంలో చెళ్లపిళ్ల కళా సేవా కమిటీ అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం తదితరులతో కలిసి ఘనంగా నిర్వహించారు. జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. వేంకటశాస్త్రి కళాసేవా సమితి, జనవిజ్ఞాన వేదిక, అరసం సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, గొల్లపల్లి సత్యనారాయణ, ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, మల్లికార్జునరావు, తాతారావు, తమ్మిశెట్టి ప్రసాద్, నిశ్చల్, నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, ఉంగరాల వీరభద్రరావు, రాజు, రవిబాబు, రాము తదితరులు మాట్లాడారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కవి గండి స్వామిప్రసాద్‌కు గుర్రం జాషువా పురస్కారంతో సత్కరించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న చిలుకూరి

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటే నేరమా?

రాజానగరం: ప్రస్తుతం సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు కూడా దీనిని వినియోగించుకుంటున్నాయి. నియోజకవర్గంలో సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీ పరంగా పోస్టులు పెట్టే వ్యక్తులకు పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. రాజానగరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రగడ చక్రికి పోలీసులు నోటీసు ఇచ్చారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్‌ల్లో వ్యక్తిగతమైన, రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టులు పెడుతున్నారని, అలా చేయడం వల్ల గొడవలకు తావిచ్చి, శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు తలెత్తుతున్నాయని, ఈ కారణంగా చట్టపరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ పోలీసులు నోటీసుల్లో స్పష్టం చేశారు.

మంచి జీవనంతో హృద్రోగాల నుంచి రక్షణ

- వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా త్రీ కే రన్



త్రీ కే రన్‌లో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జీవితంలో మంచి ఆహారపు అలవాట్లు, నిత్య వ్యాయామం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక తిలక్‌రోడ్‌లోని విజయ భారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్, పల్స్ హాస్పిటల్ సంయుక్తాధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా త్రీ కే రన్ నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో గుండె సంబంధ వ్యాధులపై అవగాహన వాక్ నిర్వహించారు. ముఖ్య అతిథులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, డాక్టర్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. తిలక్ రోడ్డు నుంచి వేంకటేశ్వర నగర్‌లో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయం వరకు వాక్ కొనసాగింది. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యాయామం చేసి, ఆహారపు అలవాట్లు మార్చుకుని గుండెను భద్రపరుచుకోవాలని సూచించారు. పల్స్ అధినేత డాక్టర్ వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ, గుండె వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుండె వైద్య నిపుణులతో హృదయ పరీక్ష చేయించుకోలన్నారు. జీవితంలో తప్పనిసరిగా ఒక్కసారి లైపో ప్రోటీన్ల స్థాయిలను చెక్ చేయించుకోవాలని సూచించారు. చెడు ఆహారపు అలవాట్లను మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన విధానం వల్ల ఆరోగ్యకరమైన మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. సెప్టెంబర్ 29వ తేదీన పల్స్, విజయ భారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తాధ్వర్యంలో మెగా కార్డియాక్ క్యాంప్ జరుగుతుందని తెలిపారు. వైద్య నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరి మాట్లాడుతూ, గుండె ఆరోగ్యం చాలా ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించే మహాగాయని లతా మంగేష్కర్

నట గాయకుడు జిత్‌మోహన్ మిత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నిరుపేద కుటుంబంలో జన్మించి, పెద్దగా చదువుకోకపోయిన లతామంగేష్కర్ సంగీతం, పాటలపై మక్కువతో, పట్టుదలతో పరిశ్రమలో రాణించి ప్రపంచం గర్వించదగ్గ మహా గాయని, భారతరత్న స్థాయికి ఎదిగారని నట గాయకుడు జిత్‌మోహన్ మిత్ర కొనియాడారు. మధుర గాయని, భారత రత్న, గాన కోకిల లతా మంగేష్కర్ జయంతి కార్యక్రమం స్థానిక జిత్‌మోహన్ మిత్ర కళావేదికలో జరిగింది. ఆత్మీయ అతిథులుగా ముద్రగడ ఏసుబాబు, జల్లి శివప్రసాద్, వి.జగపతి, బి.సీతారామారావు, శ్రీపాద కృష్ణారావు, ఎ.కృష్ణ, దత్తాత్రేయ శర్మ, పులపరామకృష్ణ , పిచ్చుక మహేష్, చింతా రమణమూర్తి, తదితర ఆర్కెస్ట్రా కళాకారులు హాజరయ్యారు. లతా మంగేష్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిత్‌మోహన్ మిత్ర మాట్లాడుతూ, లతా మంగేష్కర్ జీవితం వర్ధమాన గాయనీగాయకులకు ఆదర్శమన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, జిత్‌మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా గాయని డాక్టర్ హేమనళినిని లతాజీ పురస్కారంతో త్వరలో సత్కరిస్తామని ప్రకటించారు. గాయనీ గాయకులు లతాజీ పాడిన హిట్ గీతాలు ఆలపించారు.


లతా మంగేష్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్ మిత్ర తదితరులు

మహాచండీ అవతారంలో అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం వివిధ ప్రాంతాల్లో అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించినట్టు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. బొమ్మూరు వేంకటేశ్వరనగర్‌లో ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా, ఆలయ అర్చకులు వల్లీ కాంతాచార్యులు సరస్వతీ పూజ చేయించారు. ఆలయ ధర్మకర్త గొందేసి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో ఆలయ కమిటీ నేతృత్వంలో లహరి స్కిన్స్ యాజమాన్యం సహకారంతో విద్యార్థులకు పుస్తకం, పెన్నులు పంపిణీ చేశారు.


రాజమహేంద్రవరం ఉమా మార్కండేయ స్వామి దేవాలయంలో మహాచండీ దేవిగా..


రాజమహేంద్రవరం ఉమా మార్కండేయ స్వామి దేవాలయంలో పార్వతీదేవి


రాజమహేంద్రవరం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..


మోరంపూడిలో విజయ కనకదుర్గాదేవి

దుర్గమ్మకు సారె సమర్పణ

బొమ్మూరు వెంకటగిరి కొండపై చిరుస్టార్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల సంబరాల్లో భాగంగా ఏడో రోజు దుర్గమ్మ అమ్మవారికి భారీగా సారె సమర్పించారు. వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లతో సారెని తీసుకు రాగా, భవానీమాల ధారులు, భక్తులు డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలతో వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి వద్ద ప్రత్యేక పూజల అనంతరం సారెను తీసుకుని ఊరేగింపుగా పురవీధులలో తిరుగుతూ దుర్గమ్మ పందిరి వద్దకు చేరుకున్నారు. అనంతరం దుర్గమ్మకు భక్తులు సారె సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.


బొమ్మూరులో సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు


బొమ్మూరు దుర్గమ్మ అమ్మవారికి సారె సమర్పిస్తున్న భవానీలు


వెంకటగిరి కొండపై డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలతో సారె తీసుకొస్తున్న భక్తులు